

ఆదర్శనగర్ సచివాలయం ఎదురుగా పింఛన్ కోసం చెట్ల కింద నిరీక్షిస్తున్న పింఛనుదారులు



బక్కన్నపాలెం రోడ్డులో సచివాలయం వద్ద పింఛన్‌దారుల పడిగాపులు



పింఛన్ కోసం నమ్మివానిపేట సచివాలయానికి ఎర్రటి ఎండలో వెళ్తున్న వృద్ధులు



కృష్ణాపురం సచివాలయం వద్ద పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు



పింఛన్ తీసుకునేందుకు కుమార్తె సాయంతో సచివాలయానికి వచ్చిన 90 ఏళ్ల పాపాయమ్మ

చంద్రబాబూ.. నీకిది తగునా..?

'సరిగ్గా ఐదేళ్ల కిందటి వరకూ ఇలాంటి కష్టాలే వుండేవి. పింఛన్ల కోసం రోజుల తరబడి పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాసేవాళ్లం. జగన్ బాబు వచ్చాక ఐదేళ్లుగా వలంటీర్లు ఇంటికే తీసుకొచ్చి పింఛన్లు అందించేవారు. చంద్రబాబు కుట్ర పుణ్యమా అని మళ్లీ పాత రోజులు వచ్చాయి. టీడీపీ దుర్మార్గుల వల్లే మాకు ఈ తిప్పలు' అంటూ అవ్వాతాతలు, దివ్యాంగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ల వ్యవస్థ ద్వారా గత ఐదేళ్లుగా కడుపులో చల్ల కదలకుండా అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులకు ఒకటో తేదీ ఉదయమే ఇంటి గుమ్మం ముందు పింఛన్ అందించేవారు. ఈ విధానంపై మొదటి నుంచి ఏడుపుతో ఉన్న చంద్రబాబు, అతని అనుచరులు పెన్షన్ల పంపిణీలో వలంటీర్లు ఉండకూడదని ఎన్నికల కమిషన్‌కు తప్పుడు ఫిర్యాదు చేశారు. ఫలితంగా వారిని సేవలకు దూరం చేయడంతో నియోజకవర్గంలోని పింఛనుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏప్రిల్ నెల ప్రారంభమై మూడు రోజులవుతున్నా పింఛన్ నగదు చేతికి అందకపోవడంతో ఏం జరుగుతుందో తెలియక పండుటాకులు విలవిల్లాడిపోయారు. అసలు పెన్షన్ వస్తుందా..? రాదా..? అంటూ ఆందోళన చెందుతున్నారు. బుధవారం ఉదయం నుంచి పింఛన్ కోసం సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. – తగరపువలస

- టీడీపీ పాలనలోని గడ్డు రోజులు గుర్తు చేశారని పింఛనుదారుల ఆగ్రహం
- ఆపసోపాలు పడి పింఛన్లు తీసుకుంటున్న అవ్వాతాతలు
- సచివాలయాల వద్ద ఉదయం నుంచి పడిగాపులు
- పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరం చేసిన కుట్రపై సర్వాత్రా నిరసనలు
- ఇదెక్కడి దుర్మార్గం అంటూ చంద్రబాబుపై మండిపడ్డ దివ్యాంగులు



తాళ్లవలస సచివాలయంలో పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు



నడవలేని స్థితిలో వున్న పంచదార్ల ఎర్రమ్మను పింఛను కోసం తీసుకొస్తున్న కుటుంబ సభ్యులు



పరదేశిపాలెంలో ఫించన్ అందక నిరాశతో పైడిరాజు



మండుటెండలో వృద్ధురాలు రాజులమ్మ అవస్థలు



మారికవలస ఆర్‌జీకే కాలనీలో పింఛన్ నగదు ఇవ్వకపోవడంతో వెళ్లిపోతున్న పింఛనుదారులు

చంద్రబాబు హయాంలో ఏడిపింఛెన్..

గతంలో చంద్రబాబు హయాంలో సామాజిక పింఛన్లు రూ.70 నుంచి రూ.200 మాత్రమే ఇచ్చినా వాటి కోసం రోజుల తరబడి వేచి వుండాల్సి వచ్చేది. పంచాయతీకి మొత్తం ఒకే అధికారి సొంత పనులు చక్కబెట్టుకుని పింఛన్లు పంపిణీ చేసేందుకు 15 రోజులు పట్టేది. ఈ పెన్షన్ కోసం పండుటాకులు మండుటెండలో క్యూలైన్లలో వేచి వుండేవారు. మళ్లీ ఐదేళ్ల తర్వాత చంద్రబాబు కుట్రలతో వృద్ధులు, దివ్యాంగులు చెమటలు కక్కుకుంటూ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న తీరు పలువురిని కలచివేస్తుంది. బుధవారం భీమిలి మండల పరిధిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పింఛన్ల పంపిణీ జరగకపోవడంతో పలువురు ఆందోళన చెందారు. చాలా చోట్ల రెండు పంచాయతీలకు ఒకే సచివాలయం, ఒక పంచాయతీలో అయిదారు గ్రామాలు వుండటంతో లబ్ధిదారులు ఎండబారిన పడి సచివాలయాలకు చేరుకోలేకపోయారు. కిలోమీటర్లు కొద్దీ రహదారులు, మధ్యలో చెరువులు, నదులు కలిపి గరిష్ఠంగా 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న సచివాలయాలకు చేరుకోవడానికి ఇబ్బందులు పద్దారు.



టీడీపీ హయాంలో చిట్టివలస పరిధిలో పింఛన్ల కోసం ఎండలో నిరీక్షిస్తున్న పింఛనుదారులు

భీమునిపట్నం: జీవీఎంసీ 3వ వార్డులో సచివాలయాల వద్ద బుధవారం పింఛన్లు పంపిణీ చేశారు. అయితే ఎండలో వచ్చేందుకు పింఛనుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చంద్రబాబు వల్ల తమకు ఇన్ని కష్టాలు వస్తాయని ఊహించలేదని, ఇది ఎంతో ఘోరమని వాపోయారు.

మధురవాడ: చంద్రబాబు, టీడీపీ కుట్రతో జీవీఎంసీ 5, 6, 7 వార్డుల్లో పింఛనుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుధవారం ఉదయం నుంచే సచివాలయాల వద్ద క్యూ కట్టారు. కానీ పెన్షన్ అందకపోవడంతో పరదేశిపాలెం, మారికవలస, శివశక్తినగర్, బక్కన్నపాలెం తదితర ప్రాంతాల్లో ఈసురోమంటూ మండుటెండలో వెనుదిరిగారు. మరికొంత మంది చంద్రబాబుకు శాపనార్థాలు పెట్టారు.

వృద్ధాప్యంలో పింఛను కోసం అవస్థలు



వేములవలస సచివాలయం వద్ద పింఛను కోసం ఎదురుచూస్తున్న రామ్మోహన్‌రావు

నా పేరు పిడిగిడి రామ్మోహన్‌రావు. నాకు ఎవరూ లేరు. ఒంటరిగా జీవిస్తున్నాను. ఉండడానికి ఇల్లు కూడా లేదు. తెలిసిన వారి కంపెనీ వద్ద రేకుల షెడ్డులో తలదాచుకుంటున్నాను. ప్రభుత్వం ఇచ్చే రూ.3 వేలే నాకు జీవనాధారం. ప్రతీ నెల 1వ తేదీన తెల్లవారేసరికే వలంటీరు ఇంటికి వచ్చి పింఛను మొత్తాన్ని ఇచ్చి వెళ్లేవారు. దీంతో నాలాంటి వృద్ధులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. కానీ వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకూడదని చంద్రబాబు నాయుడు ఫిర్యాదు చేయడంతో వారిని సచివాలయానికి రానీయడం లేదు. దీంతో మమ్మల్ని వేములవలస సచివాలయానికి వచ్చి పింఛను తీసుకోమంటున్నారు. ప్రస్తుతం నా వయస్సు 85 సంవత్సరాలు. ఈ వయస్సులో ఎండతో వెళ్లి పింఛను తీసుకోవడం చాలా కష్టంగా ఉంది. గతంలో వలే ప్రతీ నెలా పింఛను కోసం దూరంగా వెళ్లాల్సి వస్తాదేమోనని బెంగగా ఉంది. ఈ వయస్సులో అంత కష్టం పడలేము. వలంటీర్లు ద్వారా ఇంటికే వచ్చి పింఛన్లు ఇచ్చే పద్ధతిని పునరుద్ధరించాలి. మంచి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మరలా ముఖ్యమంత్రి కావాలి.

– పడిగిడి రామ్మోహన్‌రావు, వేములవలస.

చంద్రబాబుది వక్రబుద్ధి



చంద్రబాబు నాయుడుది వక్రబుద్ధి. ఉన్న ఓట్లను కూడా చెడగొట్టుకోవడానికే పింఛనుదారులను ఇబ్బంది పెడుతున్నారు. ప్రతీ నెలా ఒకటో తేదీన సూర్యుడు రాకముందే వలంటీర్లు వచ్చి మాకు పింఛన్ల నగదు ఇచ్చేవారు. ఇప్పుడు కుట్ర చేసి వారు పెన్షన్లు ఇవ్వకుండా బాబు అడ్డుపడ్డాడు. ఇది చాలా తప్పు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చక్కగా పరిపాలన సాగిస్తున్నారు. అతనితో ఎవ్వరూ పోటీ పడలేరు. మళ్లీ ఆయనే రావాలి. జగన్ బాబు ఇస్తున్న పింఛను నగదే నా కుటుంబానికి ఆధారం. చంద్రబాబు తీరుతో నాలాంటి వారు ఎందరో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– కూన.కృష్ణారావు, మారికవలస ఆర్‌జీకే కాలనీ

చాలా ఇబ్బందిగా వుంది



నేను కొండ మీద నుంచి పింఛను తీసుకోవడానికి దిగువ నున్న సచివాలయానికి వచ్చాను. నాకు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో ఎంతో శ్రమ పడాల్సి వచ్చింది. ఇప్పుడు మళ్లీ కొండపైకి ఎండలో నడిచి వెళ్లాలి. గత ఐదేళ్లు హాయిగా ఇంటి వద్దే పింఛను తీసుకున్నా. ఈ నెల మాత్రం టీడీపీ నాయకుల కుట్రల వల్ల పింఛను తీసుకునేందుకు నరకయాతన అనుభవించాను. మమ్మల్ని కష్టాలకు గురి చేయడం దారుణం.

– ఒమ్మి నర్సింహరాజు, భీమిలి

మమ్మల్ని కష్టపెట్టడం సరికాదు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దయవల్ల వలంటీర్లు ప్రతీ నెల ఒకటో తేదీన ఇళ్లకు వచ్చి పింఛన్ల నగదు అందించేవారు. ఈ విషయంలో గత ఐదేళ్లు ఎంతో సంతోషంగా వున్నాం. ఇప్పుడు చంద్రబాబు కుట్రలు వల్ల మండుటెండలో సచివాలయాల వద్దకు వచ్చి పింఛన్లు తీసుకోవాల్సి వస్తోంది. మమ్మలి ఇలా కష్టపెట్టడం సరికాదు. దీనిపై ఆలోచించి ఇళ్ల వద్దే పింఛన్లు అందించేలా చూడాలి.

– అలవాని పైడిరాజు, భీమిలి

క్లుప్తంగా

అందరం వైఎస్సార్ సీపీలోనే వున్నాం



మాట్లాడుతున్న ఎంపీపీ వాసురాజు, నాయకులు

భీమునిపట్నం: భీమిలి మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు అందరం పార్టీలోనే వున్నామని, వుంటామని ఎంపీపీ దంతులూరి వాసురాజు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ పేర్కొన్నారు. వీరంతా బుధవారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. కొందరు గుర్తింపు లేని నాయకులు పార్టీని వీడి వెళ్లిపోయారని, వారి వల్ల ఎటువంటి నష్టమూ లేదన్నారు. ఇంకా చాలా మంది టీడీపీలో చేరనున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని, అందులో వాస్తవం లేదన్నారు. టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావుపై ప్రజలకు మంచి అభిప్రాయం లేదన్నారు. గతంలో మంత్రిగా స్వార్థ ప్రయోజనాలు చూసుకున్నారు తప్ప ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఐదేళ్లుగా నిత్యం ప్రజల్లో ఉంటూ మంచి పనులు చేస్తున్నారన్నారు. అందరం కలిసికట్టుగా గతంలో కంటే ఎక్కువ మెజారిటీతో ముత్తంశెట్టిని గెలిపించుకుంటామన్నారు.

అనుమతి లేకుండా టీడీపీ సమావేశం

పద్మనాభం : ఎన్నికల అధికారుల నుంచి ఎటువంటి అనమతులు తీసుకోకుండా పద్మనాభం జంక్షన్‌కు సమీపంలోని ఖాళీ స్థలంలో బుధవారం సమావేశం నిర్వహణకు టీడీపీ నాయకులు సిద్ధమయ్యారు. టెంట్లు వేసి, కార్యకర్తలందరూ చేరుకున్నారు. సమావేశం ప్రారంభించడానికి నాయకులు సిద్ధమయ్యేసరికి... విషయం తెలుసుకున్న ఎంసీసీ నోడల్ ఆఫీసర్ బి.శైలజ, సభ్యులు అక్కడకు చేరుకుని సమావేశానికి అడ్డుకట్ట వేశారు. దీంతో ఎంసీసీ సభ్యులు, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. అనుమతి లేకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారని టీడీపీ నాయకులను అధికారులు ప్రశ్నించారు. దీంతో చివరకు టీడీపీ నాయకులు తోక ముడిచి సమావేశం నిర్వహించకుండా వెళ్లిపోయారు.

వివాహిత ఆత్మహత్య

ఆనందపురం : స్థానిక హైస్కూల్‌కు సమీపంలోని బీసీ కాలనీకి చెందిన ఒక వివాహిత బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బీసీ కాలనీకి చెందిన కొత్తవలస లక్ష్మి (42) కొంత కాలంగా బీపీ, షుగర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతోంది. దీంతో కూలి పనులకు కూడా వెళ్లకుండా ఇంటి వద్దే వుంటోంది. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం కుమార్తెతోపాటు భోజనం చేసి ఇంట్లో విశ్రమించింది. కొంత సమయం తర్వాత ఇంటి సందులో గల స్లాబు హుక్కుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త రాంబాబు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గంట్యాడ సంతోష్ విచారణ జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇద్దరిపై కేసు నమోదు

పద్మనాభం: మండలంలోని రేవిడి పంచాయతీ రౌతులపాలెంకు చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ జె.సురేష్ తెలిపారు. రేవిడిలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణం కోసం పిల్లి గురువులు నుంచి కొంత భూమిని ప్రభుత్వం తీసుకుంది. దీనికి ప్రభుత్వం గురువులకు రూ.46.2లక్షలు పరిహారం మంజూరు చేసింది. ఈ సొమ్మును గురువులు ఖాతా నుంచి రమణ, శంకర్ కలిసి గురువులుతో వేలిముద్రలు వేయించుకుని నగదు డ్రా చేశారు. అందులోని కొంత సొమ్ము ఇచ్చి మిగతాది ఇవ్వలేదు. ఈ క్రమంలో రెండేళ్ల కిందట గురువులు మృతి చెందాడు. అనంతరం మిగిలిన సొమ్మును రమణ, శంకర్ వారి ఖతాల్లోకి బదిలీ చేయించుకున్నారు. దీనిపై గురువులు కుమారుడు జట్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. దీనిపై కోన రమణ, మజ్జి శంకర్ వివరణ కోరగా పిల్లి గురువులకు ఇవ్వాల్సిన డబ్బులన్నీ ఇచ్చేశామని, రాజకీయ దురుద్దేశంతోనే తమపై బురదజల్లుతున్నారన్నారు.

పథకాలు కొనసాగాలంటే జగనే సీఎం కావాలి

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: రాష్ట్రంలో గత ఐదేళ్లుగా అమలైన సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 3వ వార్డులోని చిన్నబజారు, అప్పికొండ వీధి, జూనియర్ కళాశాల రోడ్డు, తోటవీధి ప్రాంతాల్లో బుధవారం ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. దేశంలో మన రాష్ట్రంలో మాత్రమే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు ఎంతో మేలు జరిగిందని, త్వరలో ఇక్కడ ఫిషింగ్ జట్టీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం పెత్తందారులు, పేదలకు మధ్య యుద్ధం జరుగుతోందని... పేదలు గెలవాలంటే అందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు.

గంటా అవకాశవాది, స్వార్థపరుడు

టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు పక్కా అవకాశవాది, స్వార్థపరుడని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. కేవలం వ్యాపారాలు కాపాడుకోవడానికి రాజకీయాలను ఉపయోగించుకుంటున్నాడని ఆరోపించారు. గతంలో ఇక్కడ గెలిచి ప్రజలకు ఏమాత్రం మంచి చేయలేదని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ ఎలా పోటీ చేయడానికి వస్తాడని ప్రశ్నించారు. అతనికి ఓటు వేస్తే మళ్లీ ఐదు సంవత్సరాల వరకు ఎవరికీ కనిపించడన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి జనసేన నాయకులు

తోటవీధి ప్రాంతానికి చెందిన 20 మంది జనసేన నాయకులు, కార్యకర్తలు పొట్టి అప్పలరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని కోరారు. 3వ వార్డు పార్టీ అధ్యక్షుడు అల్లిపిల్లి నర్శింగరావు, నాయకులు ఎర్నింటి అచ్చిబాబు, అల్లిపిల్లి కోదండ, మారుపల్లి రాము, నాగేంద్ర, కరుణాకర రెడ్డి, వాసుపల్లి కొండబాబు, జి.మధునాయుడు, కోంద్రు రామసూరప్పడు, కదిరి ఎల్లాజీ పాల్గొన్నారు.



మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నాయకులతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఇబ్బందులు తలెత్తకుండా పింఛన్ల పంపిణీ



ఆనందపురంలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో పోలినాయుడు



చిట్టివలసలో దివ్యాంగ బాలికకు పెన్షన్ అందిస్తున్న భీమిలి జెడ్పీ కనకమహాలక్ష్మి

ఆనందపురం : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు సచివాలయాల వద్ద లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా పింఛన్లు పంపిణీ చేయాలని జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు ఆదేశించారు. ఆయన బుధవారం వేములవలస, ఆనందపురం, బోని సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల ఆరో తేదీ వరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పింఛన్లను అధికారులు పంపిణీ చేయాలన్నారు. పింఛనుదారులు ఇబ్బంది పడకుండా సచివాలయాల వద్ద టెంట్‌లు, కుర్చీలు ఏర్పాటు చేసి మంచినీరు అందుబాటులో వుంచాలన్నారు. పింఛను పంపిణీలో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. రోజూ ఎంత మందికి పింఛన్లు పంపిణీ చేశారో సాయంత్రానికి నివేదికలు అందించాలన్నారు. వృద్ధులు, వికలాంగులు, మంచానికే పరిమితమైన వారికి ఇంటికే వెళ్లి పింఛన్లు అందించాలని ఆదేశించారు. ఆయనతో ఎంపీడీవో ఎస్.అప్పలనాయుడు, ఈవోఆర్డీ కెల్ల రామారావు వున్నారు.

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్‌లో బుధవారం నుంచి ప్రారంభమైన పింఛన్ల పంపిణీని జెడ్పీ కనకమహాలక్ష్మి పర్యవేక్షించారు. తగరపువలస, చిట్టివలస, సంగివలస, చిల్లపేట గ్రామాల్లోని వార్డు సచివాలయాలను పరిశీలించారు. అనంతరం దివ్యాంగులు, వృద్ధుల ఇళ్లకు వెళ్లి సచివాలయ సిబ్బంది పంపిణీ చేసే పెన్షన్లపై ఆరా తీశారు.

స్వచ్ఛందంగా వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు



శొంఠ్యాంలో రాజీనామా పత్రాలను డిజిటల్ అసిస్టెంట్‌కు అందజేస్తున్న వలంటీర్లు

భీమునిపట్నం: జీవీఎంసీ 3వ వార్డు పరిధిలో ఆరుగురు వలంటీర్లు బుధవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రాంభక్త ప్రభాకర్‌నాయుడు, కొంకి వెంకటేష్, అప్పికొండ కృష్ణ, సుంకర వెంకటరత్నం, కాసరపు ప్రసాద్, వాడమొదల వెంకటలక్ష్మి రాజీనామా పత్రాలను జోనల్ కార్యాలయ సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు తాము ఎంతో నిజాయతీగా సేవలు అందించామని, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల వల్ల రాజీనామాలు చేశామన్నారు. ఇకపై ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గెలుపు కోసం పని చేస్తామని తెలిపారు.

శొంఠ్యాంలో ఐదుగురి వలంటీర్ల రాజీనామా

ఆనందపురం : తాము నమ్ముకున్న నాయకులకు మద్దతుగా ప్రచారం చేసి వారిని గెలిపించుకోవాలనే తపన వారిలో ఉంది. కానీ టీడీపీ కుట్ర వల్ల ప్రజలకు విస్తృతంగా సేవలు అందిస్తున్న వలంటీర్ పదవి అడ్డంకిగా మారింది. దీంతో వారు వలంటీర్ పదవిని విడిచి పెట్టి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని నిర్ణయించుకొని బుధవారం రాజీనామా చేశారు. మండలంలోని శొంఠ్యాం సచివాలయంలో యర్ర సురేష్, గంట్రెడ్డి లక్ష్మణరావు, ప్రసాదు అప్పలరాజు, కోరుకొండ సురేష్, శొంఠ్యాన సంతోష్ వలంటీర్లుగా పని చేస్తున్నారు. టీడీపీ నాయకులు చేసిన ఫిర్యాదు మేరకు వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఎన్నికల సంఘం నిబంధనలు విధించింది. దీంతో తమ అభిమాన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపు కోసం ప్రచారం చేయడానికి అడ్డంకిగా ఉన్న వలంటీరు ఉద్యోగాన్ని త్యజించారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌కు సమర్పించారు. ఇక నుంచి ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు గెలుపు కోసం పని చేస్తామని ప్రకటించారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం విస్తృత ప్రచారం



జీవీఎంసీ 7వ వార్డు స్వతంత్రనగర్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



8వ వార్డులో ప్రచారం చేస్తున్న నాయకులు



పీఎం పాలెం పరిధి లక్ష్మీవానిపాలెంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మధురవాడ : జీవీఎంసీ 7వ వార్డు స్వతంత్రనగర్ పరిసర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృతంగా ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, తదితరులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. గత ఐదేళ్లలో మధురవాడ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించారు. ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. వంకాయల మారుతీప్రసాద్, చేకూరి రజని, కె.శ్రీదేవి, బెల్లాపు పాపారావు, పసుపులేటి గోపి, తమ్మినేని వరలక్ష్మి, దత్తు వాసు, ఆదిలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కావాలంటే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని, అందుకోసం అందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో గల ఎస్సీ కాలనీ, బీసీ కాలనీల్లో బుధవారం పార్టీ నాయకులు ప్రచారం చేశారు. గడప గడపకూ వెళ్లి గత ఐదేళ్లలో సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించారు. రాజకీయ లబ్ధి కోసం టీడీపీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మొద్దన్నారు. కార్పొరేటర్ లొడగల అప్పారావు, వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, నాయకులు ఉప్పులూరి గోపి, లొడగల రామ్మోహన్, దువ్వి వాసు పాల్గొన్నారు.

పీఎం పాలెం : జీవీఎంసీ ఆరో వార్డులోని పీఎం పాలెం పరిధి లక్ష్మీవానిపాలెం, ఎస్సీ కాలనీలలో బుధవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. జేసీఎస్ ఇన్‌చార్జి గాదె రోసిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, కె.వరలక్ష్మి, పోతిన సూరిబాబు, ఎల్లాజీ, వీవీ నరసింహారావు, ఈశ్వరరావు, సియ్యాద్రి కనకరాజు, అనూష పాల్గొన్నారు.

దేవదాయ శాఖ భూముల పరిరక్షణకు చర్యలు

- కమిషనర్ సత్యనారాయణ

మధురవాడ: దేవదాయ శాఖ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు ఆ శాఖ కమిషనర్ సత్యనారాయణ చెప్పారు. బుధవారం ఆయన అధికారులతో కలసి మధురవాడ జోనల్ కార్యాలయం సమీపంలోని సర్వే నంబర్ 12లో గల భూములు, అందులోని ఆక్రమణలు పరిశీలించారు. ఇక్కడ ఉన్న సుమారు 18 ఎకరాలతో పాటు ఇతర భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించారు. ఆయన వెంట అసిస్టెంట్ కమిషనర్ శిరీష, డిప్యూటీ కమిషనర్ సుజాత ఉన్నారు.



మధురవాడలో దేవదాయ శాఖ భూములు పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ